క్లుప్తంగా

సేవాభావం కలిగి ఉండాలి



ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ జాతీయత పట్ల సేవాభావం కలిగి ఉండాలని డాక్టర్ జేవీ సుధీర్ కుమార్ అన్నారు. మండల కేంద్రం లోని సేయింట్ జేవియర్ ఫార్మసీ కళాశాలలో మంగళవారం ఆర్సీజేసీ ఆధ్వర్యంలో 55వ జాతీయ సేవా పథకంను పురస్కరించుకొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్స్ జె.వణ్‌మణి, సుదర్శన్, ఆర్.రాణి, మెర్లీరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవో సమతా వాణి బాధ్యతల స్వీకరణ



తాడికొండ: ఎంపీడీవోగా కె.సమతా వాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పల్నాడు జిల్లా దుర్గి మండలంలో ఎంపీడీవోగా పనిచేసిన ఆమె సాధారణ బదిలీలో భాగంగా తాడికొండ మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు.

అధ్యాపకులకు అవార్డు ప్రదానం



మంగళగిరి: మండలంలోని నీరుకొండ గ్రామంలో ఉన్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. వర్షాలు, వరదలు కారణంగా నిలిచిపోయిన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించి, అధ్యాపకులకు అవార్డులు ప్రదానం చేశారు. డాక్టర్ సుదర్శన్ హెచ్‌బీ తివారికి బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డుతో పాటు మరో 9 మందికి ఉత్తమ అధ్యాపక అవార్డు ప్రదానం చేశారు. యూనివర్సిటీ గౌరవ సలహాదారు వజ్జా సాంబ శివరావు, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్, డీన్లు డాక్టర్లు భరద్వాజ్, విష్ణువత్ పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాలలోని డాక్టర్ కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.రాఘవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు కలిగి ఉండాలన్నారు. ఎన్ఎస్ఎస్‌లో చేరడం ద్వారా సాటి మనిషికి సాయం, సేవ చేయాలనే భావన ఏర్పడుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ ప్రతిజ్ఞ చేయించి, కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. వై. పూర్ణచంద్రరావు, కె.సరళాదేవి, బి.పద్మలత, ఎన్ఎస్ఎస్ అధికారి బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరు ఎంపీడీవోగా తోట చందన



మేడికొండూరు: ఎంపీడీవోగా తోట చందన మంగళవారం పదవి బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె మార్కాపురం నుంచి ఇక్కడికి వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని చెప్పారు.

కోనేటిపురంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: కోనేటిపురంలో తరచూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. సోమవారం అర్ధరాత్రి కోనేటిపురం 6వ వార్డులో చెట్ల కొమ్మల వల్ల షార్ట్ సర్క్యూట్ అయి విద్యుత్ తీగ తెగిపోయింది. దీంతో సరఫరాకు అంతరాయం కలిగింది. స్థానికుల ఫిర్యాదుతో పల్లెకోన నుంచి లైన్‌మెన్ వచ్చి సమస్యను పరిష్కరించారు. విద్యుత్ అంతరాయంతో మూడు గంటల పాటు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. లైన్‌మెన్ లేక కష్టాలు తప్పడం లేదంటున్నారు.

రేపు విద్యుత్ అదాలత్

కొరిటిపాడు(గుంటూరు): సంగడిగుంటలోని విద్యుత్ భవన్ సమావేశ మందిరంలో గురువారం విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు గుంటూరు టౌన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు టి.శ్రీనివాస్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలు, గుంటూరు రూరల్, పెదకాకాని మండలాల్లోని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లింగాకర్షక బుట్టలతో రసం పీల్చు పురుగు నివారణ

పొలం పిలుస్తోందిలో లాం పత్తి పరిశోధన స్థానం శాస్త్రవేత్త నాగజ్యోతి



పత్తి పంటను పరిశీలిస్తున్న లాం ఫాం శాస్త్రవేత్తలు

తాడికొండ: పత్తిలో రసం పీల్చు పురుగుల నివారణకు లింగాకర్షక బుట్టల ఏర్పాటు తప్పనిసరి అని లాం వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త నాగజ్యోతి అన్నారు. తుళ్ళూరు మండలం పెద పరిమి, వడ్డమాను గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని, ప్రసంగించారు. అధిక వర్షాలకు నీళ్ల పడిన పంట పొలాలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయని, నీటిని బయటకు పంపించి యూరియాను చల్లడంతో పాటుపై పాటుగా పోషకాలు అందించే మందులు పిచికారీ చేయాలన్నారు. వరుసగా 3 రోజుల పాటు లింగాకర్షక బుట్టలో 8 రెక్కల పురుగులు, పొలంలో అక్కడక్కడా 20 పువ్వుల్లో 2 గుడ్డిపూలు గమనించినట్లయితే తక్షణ సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. సామూహిక లింగాకర్షక బుట్టల ఏర్పాటు ద్వారా గులాబీ రంగు పురుగును సమర్థవంతంగా అరికట్టవచ్చు కనుక రైతులు సమిష్టిగా లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరెడ్డి, జిల్లా వనరుల కేంద్రం శాస్త్రవేత్త హైమావతి, ఏవో, శ్రీ రంజని పాల్గొన్నారు.

అవసరం మేరకు ఎరువుల వినియోగం

తాడేపల్లిరూరల్ : రైతులు అవసరం మేరకు ఎరువులు, పురుగు మందులు పంటలో వినియోగించాలని తెనాలి సబ్‌డివిజన్ ఏడీఏ ఎన్.ఉషారాణి అన్నారు. మంగళవారం దుగ్గిరాల మండల పరిధిలోని పెరికలపూడి, ఈమని గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథి పాల్గొని, పంట పొలాలను పరిశీలించారు. వర్షానికి దెబ్బతిన్న పంటలకు యూరియా 25 కేజీలు, పొటాష్ 15 కేజీలు తప్పనిసరిగా వాడాలని సూచించారు. సుడిదోమ ఉధృతిని బట్టి డైనోట్రోఫ్యూరాన్ పురుగు మందు వాడొచ్చని సూచించారు. పశు వైద్యాధికారి సురేష్, మండల వ్యవసాయ అధికారిణి శిరీష, ఏఈఓ రమేష్, ఎంపీటీసీ సాయి చైతన్య పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి

ఫిరంగిపురం: ప్రత్తి పంటను ఆశించి కాయను తొలిచే గులాబి రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయ శాఖాధికారి వాసంతి అన్నారు. మండలంలోని వేమవరం గ్రామంలో మంగళవారం పత్తి పంటను పండించే రైతులకు అధికారులు తగు సూచనలు చేశారు. పొలం వద్దకు వెళ్లి మొక్కలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండవ నరసింహారావు, సాంబశివరావు రైతులు పాల్గొన్నారు.



లింగాకర్షక బుట్టల ఏర్పాటును చూపిస్తున్న వ్యవసాయ సిబ్బంది

నేర రహిత నగరంగా మంగళగిరి

- నిఘా విభాగం అప్రమత్తంగా ఉండాలి
- శాఖల అధికారులతో ఎస్పీ సతీష్ కుమార్



సీఐ వినోద్‌కుమార్‌కు సూచనలిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్(ఎంటీఎంసీ)ని నేర రహిత నగరంగా తీర్చిదిద్దాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో ఎస్పీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రధానంగా నగరంలోని అన్ని కూడళ్ళలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే కెమెరాలు పరిశీలించి, 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాలతో పాటు నిఘా విభాగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. నగరంలో గుర్తించిన కూడళ్లలోని సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. గత కొద్ది రోజులుగా నగరంలో జరుగుతున్న చోరీలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దొంగలను పట్టుకునేందుకు చర్యలు తీసుకున్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో నేర రహిత నగరంగా మార్చేందుకు చర్యలు తీసుకుని, అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్పొరేషన్ కమిషనర్ అలీం బాషా , డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, అడిషనల్ కమిషనర్ శకుంతల, విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

29న గుర్రం జాషువా పురస్కారాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళా పరిషత్ సభ్యులు

తాడేపల్లిరూరల్ : అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ పద్మభూషణ్ గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ దుగ్గిరాల 36వ వార్షికోత్సవం, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి సందర్భంగా పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పెద్దేటి యోహాన్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా దుగ్గిరాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ గౌరవ సలహాదారు షేక్ సుభాని మాట్లాడుతూ సెప్టెంబర్ 29న మహాకవి జాషువా పద్య పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, కళా, సేవా రంగాలు, బుర్ర కథల్లో నైపుణ్యం కనబరిచిన వారికి జాషువా పురస్కారాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం జాషువా విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గురువిందపల్లి సుగుణరాజు, పులివర్తి కోటేశ్వరరావు, మోపర్తి కోటయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు, ఇప్పటంలో పారిశుద్ధ్యం



చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

తాడేపల్లిరూరల్ : ఆత్మకూరు, ఇప్పటం ప్రధాన రహదారుల వెంబడి కార్పొరేషన్ సిబ్బంది స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్యం మంగళవారం చేపట్టారు. ఆత్మకూరు మెయిన్ రోడ్డు నుంచి వార్డు సచివాలయం వరకు, అనంతరం జాతీయ రహదారి సర్వీస్ రోడ్ నుంచి రైల్ గేటు మీదుగా ఇప్పటం వెళ్లే ప్రాంతంలో రోడ్డు వెంబడి ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించి, బ్లీచింగ్ చల్లారు. ఇప్పటం వడ్రుపాలెంలో పేరుకుపోయిన చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లారు. కాలువల వెంబడి కలుపు మొక్కలను తొలగించారు. దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. తాగునీటి పైపులైన్లను పరిశీలించి, మరమ్మతులు చేయించారు. అక్టోబర్ 2 వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని కమిషనర్ అలీమ్‌బాషా పిలుపునిచ్చారు.

వెంటనే నష్ట పరిహారం చెల్లించాలి

సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి



మాట్లాడుతున్న సీపీ రాజధాని డివిజన్ కార్యదర్శి రవి

తాడేపల్లిరూరల్ : కొండవీటి వాగు వరద ముంపునకు గురై పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి డిమాండ్ చేశారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో జరిగిన మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. సీపీఎం పతాకాన్ని సీనియర్ నాయకులు ఈమని రామారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ యూ-1 జోన్‌ను ఎత్తివేయాలని, ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాల కోరారు. అనంతరం కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ఉండవల్లి సీపీఎం 1వ శాఖ నూతన కార్యదర్శిగా వల్లభాపురం వెంకటేశ్వర రావు, 2వ శాఖ నూతన కార్యదర్శిగా తక్కెళ్లపాటి బక్కిరెడ్డి, సహాయ కార్యదర్శిగా కె.రామకృష్ణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పలకలూరి గాంధీ, పి.రాఘవులు, రాజధాని డివిజన్ నాయకుడు సీహెచ్ సుందరరావు, నాయకులు కె.జగదీశ్వర్ రెడ్డి, వి.పార్థసారథి, శ్రీనివాసరెడ్డి, ఆర్‌వీ రాఘవయ్య, సైకం వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఏపీపీగా కె.శివలీల

మంగళగిరి: మంగళగిరిలోని అడిషనల్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కె.శివలీల నియమితులయ్యారు. మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆమెకు పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు. ఇప్పటి వరకు గుంటూరు ఎక్సైజ్ కోర్టులో పనిచేశారు.

వ్యర్థాలు తొలగించిన కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్ : కృష్ణా నది పరీవాహక ప్రాంతంలోకి ఇటీవల వరదలకు కొట్టుకొచ్చిన వ్యర్థాలను వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మంగళవారం తొలగించారు. విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా పాతూరు పరిధిలో కృష్ణానది ఒడ్డుకు వచ్చిన ప్లాస్టిక్ సంచులను, చెత్తా చెదారాన్ని వర్సిటీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు తొలగించారని తెలిపారు. సమస్త జీవరాశి మనుగడకు ప్రాణాధారమైన నదులు, కాలువ, చెరువులను సంరక్షించుకోవాలన్నారు. గ్రామ ప్రజలకు, వలంటీర్లకు ఎన్ఎస్ఎస్ అధికారి షేక్ సమీర్ అవగాహన కల్పించారు. వ్యర్థాలను దగ్ధం చేసినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ తెలిపారు. సమన్వయ కర్తలుగా కో-ఆర్డినేటర్లు పి.సురేష్, జి.చంద్రశేఖర్ వ్యవహించారు. విద్యార్థులను వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్రిన్సిపల్ డాక్టర్ టీకే రామకృష్ణారావు, సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, వ్యవసాయ కళాశాల విభాగాధిపతి డాక్టర్ బి.బాలకృష్ణ, ఆచార్యులు డాక్టర్ ఎస్. కిరణ్ తదితరులు అభినందించారు.

పీడిత ప్రజానీకం కోసం ఉద్యమించాలి



మాట్లాడుతున్న ప్రతినిధులు

మంగళగిరి: కులం,మతం దోపిడీ లేని సమాజం కోసం పీడిత ప్రజానికం ఉద్యమించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ప్రధాన కార్యదర్శి యు.గనిరాజు పిలుపునిచ్చారు. మంగళవారం నగర పరిధిలోరి చినకాకాని గ్రామంలో సభ నిర్వహించారు. సభలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే స్థాపించిన సత్య శోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఏఐకేఎంఎస్ నాయకులు ముద్రబోయిన కృష్ణ, రెడ్డి వెంకటేశ్వరరావు, రెడ్డి వెంకటేశ్వరరావు, జి.వెంకటేశ్వరరావు, జె.రవి, జి.సీతయ్య, వాసు, బాలకృష్ణ, సాంబయ్య పాల్గొన్నారు.

జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం



ప్రశంసా పత్రం అందజేస్తున్న కరస్పాండెంట్ సిస్టర్ నిర్మల్ జ్యోతి

మంగళగిరి: నగర పరిధిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. వేడుకలకు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ దివ్వ తేజోమూర్తి హాజరై విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ తేజోమూర్తి మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ఎంతో ఉన్నదమైనదన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం పొందడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ నిర్మల్ జ్యోతి, ప్రిన్సిపల్ డాక్టర్ పాములరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ నరేష్‌బాబు, సమన్వయకర్త నరసింహ నాయక్, స్టూడెంట్ కో- ఆర్డినేటర్స్ బి.దివ్యశ్రీ,, రితేష్ చంద్ర పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల కృషి హర్షణీయం



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

తాడికొండ: సమాజ సేవలో ఎన్ఎస్ఎస్ విభాగ విద్యార్థుల పాత్ర హర్షణీయమని తాడికొండ బీఎస్ఎస్‌బీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.సునీత లక్ష్మీ అన్నారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సేవా విభాగం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు సమాజ సేవలో ఉన్న గొప్పదనం, సేవాభావం అందిపుచ్చుకునేందుకు కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ధావ రామారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వేణుబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీడ్ యాక్సిస్ రోడ్డుపై టైరు పగిలి అదుపు తప్పిన కారు

తాడికొండ: కారు టైరు పగిలి అదుపు తప్పి పైపులను ఢీకొట్టిన ఘటన తుళ్ళూరు మండలం సీడ్ యాక్సిస్ రోడ్డుపై తాళ్ళాయపాలెం జంక్షన్‌లో జరిగింది. వివరాల ప్రకారం విజయవాడ నుంచి సచివాలయం వైపు సీడ్ యాక్సిస్ రోడ్డుపై వస్తున్న కారు టైరు బరస్ట్ కావడంతో అదుపుతప్పి పక్కకు దూసుకుపోయింది. రోడ్డుకు పక్కన ఉన్న భారీ పైపులను బలంగా ఢీకొట్టడంతో ముందు భాగం నుజ్జు నుజ్జయ్యింది. అదృష్టవశాత్తు కారులో ఉన్నవారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్



ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

మేడికొండూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం మండల పరిధిలోని పేరేచర్ల గ్రామంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ హాజరయ్యారు. ఎమ్మెల్యే శ్రావణ్ గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, కొత్త పెన్షన్లు ఎప్పుడు మంజూరు చేస్తారని గ్రామ ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. నవంబరు నుంచి అర్హులైన అందరికీ పెన్షన్లు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీడీఓ తోట చందన, సర్పంచ్ దేవరకొండ రాజ్ కుమార్, పాములపాటి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు పాములపాటి సురేష్, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లిపెద్ది రమేష్, మాజీ ఎంపీపీ మొక్కల సుబ్బారావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పాములపాటి శివన్నారాయణ, నార్నే శ్రీనివాసరావు, షేక్ అబ్దుల్ గని జిల్లా మైనార్టీ అధ్యక్షుడు, గ్రామ పార్టీ అధ్యక్షుడు తుమ్మల రజిని కృష్ణ, కె.వెంకటేశ్వరరావు, ఖరీదు హరి బ్రహ్మయ్య, జనసేన పార్టీ నాయకులు నాగబాబు, కందుల సైదయ్య పాల్గొన్నారు.

నాలుగేళ్ల బాలుడికి కాలేయ మార్పిడి శస్త్రచికిత్స

వివరాలు వెల్లడించిన మణిపాల్ వైద్యులు



మాట్లాడుతున్న మణిపాల్ వైద్యులు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లిలోని మణిపాల్ హాస్పిటల్ వైద్యులు హెపాటో బ్లాస్టోమాతో బాధపడుతున్న నాలుగేళ్ల బాలుడికి విజయవంతంగా లివింగ్ డోనర్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్ర చికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హాస్పిటల్ క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం అందించిన నిధులు, మణిపాల్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో నాలుగేళ్ల బాలుడికి కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించామన్నారు. పొత్తికడుపు నొప్పి, వాపు లక్షణాలతో బాధపడుతున్న బాలుడిని జూలై 31న మణిపాల్ ఆసుపత్రిలో చేర్పించారని చెప్పారు. పరీక్షలలో ఆ బాలుడి కాలేయంలో కుడి లోబ్‌లో తక్కువ స్థాయి జీవక్రియ పరంగా గాయం ఉన్నట్లు గుర్తించామన్నారు. అనంతరం హిస్టో పాథలాజికల్ పరీక్ష ద్వారా హెపాటో బ్లాస్టోమా సమస్య ఉందని, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ తప్పనిసరి అని నిర్ధారించామని వివరించారు. ఆగష్టు 1న కాలేయ మార్పిడిని విజయవంతంగా నిర్వహించి చిన్నారికి కొత్త జీవితాన్ని అందించినట్లు చెప్పారు. డాక్టర్ ప్రదీప్ థామస్ చెరియన్ మాట్లాడుతూ శస్త్రచికిత్స అనంతరం రోగిని ఐసీయూలో క్రిటికల్ కేర్, పీడియాట్రిక్, మెడికల్ గ్యాస్ట్రో వైద్య బృందం నిశితంగా పరిశీలించిందన్నారు. ఆగష్టు 9న బాలుడు నిలకడ స్థితిలో ఉండగా డిశ్చార్జ్ అయ్యాడని, కోలుకోవడానికి వాడాల్సిన మందులను వైద్యులు సూచించారని తెలిపారు.

డివైడర్లు ఢీకొన్న లారీలు

- తృటిలో తప్పిన ప్రమాదం

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు వేర్వేరు ఘటనల్లో రెండు లారీలు డివైడర్లును ఢీకొన్నాయి. స్థానికుల వివరాల మేరకు కాకినాడ నుంచి కర్ణాటక జిందాల్ కంపెనీకి ఐరన్ మట్టితో వెళ్తున్న లారీ సోమవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు ఆగి ఉన్న మరో వాహనాన్ని తప్పించబోయి ఆర్టీసీ బస్టాండు సమీపంలో డివైడర్‌ను ఢీకొంది. లారీ ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఎవరికీ గాయాలు కాలేదు. అలాగే కర్నూలు జిల్లా కోడుమూరు నుంచి ఉల్లిపాయల లోడుతో తాడేపల్లిగూడెం వెళ్తున్న లారీ మంగళవారం తెల్లవారు జామున ఆవులు అడ్డు రావడంతో అదుపుతప్పి పంచాయతీ కార్యాలయం వద్ద డివైడర్ ఢీకొంది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ నాయక్ చేతికి గాయాలయ్యాయి. పాల కేంద్రానికి పాలకోసం వచ్చే వినియోగదారులు, పారిశుద్ధ్య కార్మికులు కార్యాలయం సమీపంలోనే కూర్చునేవారు. కాగా వారు రావడం ఆలస్యం కావడంతో ప్రమాదం తప్పిందని చెబుతున్నారు.అయితే ప్రతి నెలా ఇటువంటి ఘటనలు జరుగుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

తెనాలిరూరల్: గత ఐదేళ్లుగా ఔట్‌సోర్సింగ్ విధానంలో మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్‌లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బేవరేజస్ కార్పొరేషన్ సేల్స్‌మెన్ అండ్ సూపర్‌వైజర్ల తెనాలి ఎక్సైజ్ డిపో అసిస్టెంట్ మేనేజర్‌ను కోరారు. తెనాలి డిపోలో ఏడీఎంను అసోసియేషన్ సభ్యులు మంగళవారం కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 3600 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 12 వేలకుపైగా సిబ్బంది పనిచేస్తున్నామని, ఇప్పుడు కొత్త ప్రభుత్వం వచ్చాక ఉద్యోగాల నుంచి తొలగిం చేస్తున్నారని, ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు మంత్రి వర్గం ఆమోదం తెలపడంతో తాము అయోమయంలో ఉన్నామని చెప్పారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ తెనాలి అధ్యక్షుడు పినపాటి కొండల రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రజాక్, ధనరాజుపల్లి సురేష్, భాస్కర్, గోపి, ప్రకాష్, ఆనంద్, అశోక్, శ్రీనివాస్, నాగూర్, సందీప్, ఇతర సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు ఉన్నారు.

వార్డు సభలను సమర్థంగా నిర్వహించండి

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధ, గురువారాల్లో జరిగే వార్డు సభల్లో ప్రజలందరూ పాల్గొనే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 సంబంధించిన విధి విధానాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ వి.మహాలక్ష్మీపతిరావు, హౌసింగ్ ఈఈ వై.భాస్కరరావు, పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.